## క్లుప్తంగా

### జీపీ భవనాల పనులను ప్రారంభించాలి



**ధర్పల్లి:** గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నూతన గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు మంజూరైన ఆయా గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. జీపీ భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది జీన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల సందర్శన



**సిరికొండ:** మండలంలోని పోత్నూర్ గ్రామంలో కేంద్ర సెక్రటేరియట్ సెక్షన్ అధికారులు రాజీవ్, సచిన్‌కుమార్, కేశవ్‌కాంత్, పునీత్ మిట్టల్, పరస్‌ఆర్య సోమవారం ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. అనంతరం సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలుపై, లబ్ధిదారులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, సర్పంచ్ మంజుల, సీసీ నర్సయ్య, కారోబార్ లింబారెడ్డి,ఫీల్డ్‌అసిస్టెంట్ రంజిత్‌రెడ్డి ఉన్నారు.

### పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



**ధర్పల్లి:** ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ధర్పల్లి సీఐ సైదా అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పోలీసుల సలహాలు సూచనలు తప్పకుండా ప్రతి ఒక్కరు పాటించాలని పేర్కొన్నారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



**ఇందల్వాయి:** మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబరిమోహన్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కబడ్డీ,ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ గోవర్దన్ రెడ్డి, ఎంపీడీవో రాములు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'పోరాటాల ఫలితంగానే రైల్వేగేట్‌ను తెరిచారు'



**ఖలీల్‌వాడి:** నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లోగల రైల్వేగేట్‌ను రైల్వేగేట్ పరిరక్షణ కమిటీతోపాటు సామాన్య ప్రజలు పోరాటం చేయడంతో తెరిచినట్లు మాజీ మేయర్, కాంగ్రెస్ నేత ధర్మపురి సంజయ్ అన్నారు. ఈమేరకు సోమవారం రైల్వేగేట్‌ను తెరవడంతో సంజయ్‌ను రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు, స్థానికులు సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు నిత్యం ముందుంటానని తెలిపారు.

### సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**నిజామాబాద్‌అర్బన్:** సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు శంతన్ డిమాండ్ చేశాడు. నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలకు సోమవారం ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులుగా ఎంతో బాధ్యతతో విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రభుత్వం వీరి సమస్యను పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలన్నారు.

# అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

**నిజామాబాద్‌నాగారం:** నగరంలో అభివృద్ధి పనులు అందరి సహకారంతోనే సాధ్యమవుతాయని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. అభివృద్ధిలో రాష్ట్రంలోనే నగరం ద్వితీయ స్థానంలో ఉందని పేర్కొన్నారు. నగరంలోని 6వ డివిజన్, 23వ డివిజన్‌లో నూతనంగా నిర్మించే రోడ్లు, డ్రైనేజీలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన రోడ్లను విస్తరించి విశాలంగా నిర్మించామన్నారు. ఎల్లమ్మ గుట్ట రైల్వేకమాన్ వద్ద ఆర్‌యూబీ నిర్మించి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చామన్నారు. కార్పొరేటర్లు తడ్కల్ ఉమారాణి శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, సిర్పరాజు, పంచారెడ్డి సూరి, మురళి, రవికుమార్, సంతోష్, మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాలనీ సమస్యలు పరిష్కరించాలి**

నగరంలోని వినాయక్ నగర్, న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఎమ్మెల్యే గణేశ్‌గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, నిధులు కేటాయించి తొందరలో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి





సిరికొండలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు.. నగరంలో ధర్నా చేస్తున్న సిబ్బంది

**నిజామాబాద్‌నాగారం/సిరికొండ/మోపాల్(నిజామాబాద్‌రూరల్):** తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. సిరికొండలో అంగన్‌వాడీలు సమ్మె ప్రారంభించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మోపాల్‌లో అంగన్‌వాడీల సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పెద్ది వెంకట్రాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్ మద్దతు తెలిపారు. అధికారులు పలు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టడంతో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు నగరంలో ధర్నా చేశారు. నూర్జహాన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం నెల రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. లేదంటే దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ, సులోచన, వాణి, జరీనా, సరిత సునీత శివ, రాజమ్మ సుజాత రాధికా స్వప్న పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- కులసంఘాలకు నిధుల ప్రొసీడింగ్ పత్రాల అందజేత





నిధుల మంజూరు ప్రతాలను అందజేస్తున్న ఎమ్మెల్యే.. బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

**డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి:** రాష్ట్రంలోని అన్ని కులాలు, ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సమన్యాయం చేస్తుందని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. నగరంలోని తన నివాసగృహంలో సోమవారం ఆయన జక్రాన్‌పల్లి, నిజామాబాద్ రూరల్,సిరికొండ మండలాలకు చెందిన కుల సంఘాలకు మంజూరైన రూ.18.50 లక్షల నిధుల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తన ఎంపీ లాండ్స్ నిధులు, ఆయన తండ్రి రాజ్యసభ సభ్యుడు డి శ్రీనివాస్ నిధులు మొత్తం 5 సంవత్సరాలకు రూ.50కోట్ల నిధులు ఏ గ్రామానికి ఇచ్చారో ప్రజలు అడగాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు వివిధ పార్టీల నాయకులు గ్రామాలకు వచ్చి దొంగ హామీలు ఇస్తున్నారని వారిని ప్రజలు నిలదీయాలని సూచించారు. అనంతరం రూరల్ నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్‌వోసీలను అందజేశారు. అలాగే డిచ్‌పల్లి మండలం సుద్దపల్లికి చెందిన 52మంది బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, దాసరి లక్ష్మీనర్సయ్య, సొసైటీ వైస్‌చైర్మన్ కుమ్మరి చిన్న గంగారాం, ఎంపీటీసీ స్వామి, నాయకులు రజాక్ ఖాన్, అక్బరుద్దీన్, షబ్బీర్, జునాయుద్దిన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

### శివాలయాల్లో ప్రత్యేక పూజలు



**ఖలీల్‌వాడి/నిజామాబాద్ సిటీ:** నగరంలోని పలు శివాలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠేశ్వర ఆలయం, శంభుని గుడి, ఉమా మహేశ్వర ఆలయం, నగరేశ్వర గుడి, మల్లారం లింగేశ్వర గుట్ట, నందిపేట్‌లోని పలుగుట్ట శివాలయం, బోధన్‌లోని ఏకచక్రేశ్వర శివాలయం, నగరంలోని కోటగల్లి భక్త మార్కేండేయ ఆలయం, నగరశివార్‌లో గల మడిలేశ్వర ఆలయం, వినాయక్‌నగర్‌లోని అమరేశ్వర శివాలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి, స్వామివార్లను దర్శించుకున్నారు. నీలకంఠేశ్వరాలయంలో మంచాల శంకరయ్యగుప్తా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జ్ఞానేందర్‌గుప్తా దంపతులు అన్నపూజ నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.





### ఘనంగా నాగ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలంలోని కంజర్ గ్రామంలో నాగ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా కొనసాగాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. నేడు గ్రామంలో బోనాల ఊరేగింపు ఉంటుందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు.



# ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు



డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు



ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద..



నగరంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశా వర్కర్లు

**డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి/నిజామాబాద్ నాగారం:** తమ డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లోని ఆశావర్కర్లను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. జక్రాన్‌పల్లి మండలంలో 44మందిని, డిచ్‌పల్లి మండలంలో 19 మంది ఆశా వర్కర్లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద 81మంది ఆశా వర్కర్లను పోలీసులు స్టేషన్‌కి తరలించారు. మధ్యాహ్నం తర్వాత తహసీల్దార్ వెంకట్ రావు ఎదుట బైండోవర్ చేసి వదిలి పెట్టారు.

**ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..**

ఆశా వర్కర్లను అక్రమ అరెస్టులకు నిరసనగా నగరంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సిబ్బందికి రూ.18వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.

### పెంచిన వేతనాలు చెల్లించండి



**నిజామాబాద్‌నాగారం:** పారిశుద్ధ్య కార్మికులకు మేడే కానుకగా పెంచిన వెయ్యి రూపాయలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో వారు అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రమేష్‌బాబు, సుధాకర్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు మేడే కానుకగా వేతనాన్ని రూ. వెయ్యి పెంచిందన్నారు. కానీ పారిశుధ్య డ్రైవర్లకు రెండు నెలలు చెల్లించి, తిరిగి రికవరీ చేశారన్నారు. వెంటనే పెంచిన వెయ్యి రూపాయలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేయాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. నాయకులు భూపతి, ఏక్నాథ్, లక్ష్మణ్, చంద్రసింహ, వెంకటేష్, మహేష్, అశోక్, పాల్గొన్నారు.

# సనాతన ధర్మం శాశ్వతమైనది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్



నగరంలో ఉదయనిధి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

**సుభాష్‌నగర్:** సనాతన ధర్మం శాశ్వతమైనదని, ఈ ధర్మాన్ని నిర్మూలించే దమ్ము ఎవరికీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా పేర్కొన్నారు. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఇటీవల సనాతన ధర్మంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ సోమవారం బీజేపీ నాయకులు నగరంలో ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సూర్యచంద్రులు ఉన్నంత వరకూ సనాతన ధర్మం ఉంటుందని స్పష్టంచేశారు. ప్రపంచ ప్రజలు సనాతన ధర్మం వైపు చూస్తుంటే, మన దేశంలో కొంతమంది నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, విజయ భారతి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, శివప్రసాద్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం..



**సిరికొండ/ఇందల్వాయి:** కాంగ్రెస్ ఓబీసీ సెల్ సిరికొండ మండలాధ్యక్షుడిగా పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన పిట్ల నర్సింగ్ నియామకమయ్యారు. ఇందల్వాయి మండల బీసీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన కనుగుల గంగాధర్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి వారికి నియామకపత్రాన్ని అందజేశారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



**నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఎల్లమ్మగుట్ట మాల జంగం మహేశ్వర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెముగంటి నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కొండ మచ్చేందర్, కోశాధికారిగా పెగడ ప్రకాష్ ఎన్నికయ్యారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 60,800 | వెండి (కిలో) | 75,600 |
| 22 క్యారెట్స్ | 56,055 | - నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 180 |
| | | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 750 |

### కూరగాయల ధరలు (రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 8 | 16 | గాజరుగడ్డ | 40 | 60 |
| బెండకాయ | 35 | 50 | పచ్చిమిర్చి | 30 | 50 |
| బీరకాయ | 30 | 50 | దోసకాయ | 25 | 50 |
| దొండకాయ | 25 | 50 | ఆలుగడ్డ | 20 | 40 |
| బీర్నీసుకాయ | 30 | 50 | గోబిగడ్డ | 18 | 40 |
| కాకరకాయ | 25 | 50 | గోబిపువ్వు | 25 | 50 |
| వంకాయ | 25 | 50 | బీట్‌రూట్ | 35 | 60 |
| పాలకూర | 40 | 60 | కరివేపాకు | 40 | 60 |
| మెంతికూర | 30 | 50 | చామగడ్డ | 35 | 60 |
| కొత్తిమీర | 45 | 60 | గోరుచిక్కుడు | 35 | 60 |
| పుదీనా | 50 | 70 | చిక్కుడుకాయ | 45 | 70 |
| క్యాప్సికం | 25 | 50 | | | |

- సుభాష్‌నగర్

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | జవాన్(తెలుగు)- 1.10 |
| | జవాన్(హిందీ)- 4.10,7.20,10.30 |
| స్క్రీన్-2 | ఖుషి(తెలుగు)- 10.20 ,4.20,10.30 |
| | మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి(తెలుగు)-1.25,7.30 |
| స్క్రీన్-3 | జవాన్(తెలుగు)- 10.15, 4.30,7.35, 10.35 |
| | జవాన్(హిందీ)- 1.20 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | జవాన్(హిందీ)- 11.30,3.05,6.40, 10.15 |
| స్క్రీన్-2 | జవాన్(హిందీ)-10.30,5.40,9.15 |
| | జవాన్(తెలుగు)-2.05 |
| స్క్రీన్-3 | జవాన్(తెలుగు)- 11.05 |
| | ఖుషి(తెలుగు)- 2.40,6.05 |
| | మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి 9.30 |
| స్క్రీన్-4 | జవాన్(హిందీ)- 9.45 |
| | ది నన్-2(ఇంగ్లీష్)- 1.50,7.35 |
| | మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి 4.25 |
| | ఖుషి -10.10 |
| దేవి | ఖుషి |
| నటరాజ్ | జవాన్(హిందీ) |
| లలితామహల్ | మిస్ శెట్టి మిస్టర్ పొలీశెట్టి |
| విజయ్ | జవాన్(తెలుగు) |

## సంక్షిప్తం

**స్వర్గరథం అందజేత**

**డిచ్‌పల్లి:** మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీదుర్గామాత సేవా కమిటీ ఆధ్వర్యంలో రూ.2.40లక్షలతో స్వర్గరథం తయారు చేయించారు. సోమవారం గ్రామ పంచాయతీకి అందజేశారు. వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌బీఎల్ బ్యాంకు ప్రారంభం**



**నిజామాబాద్‌నాగారం:** నగరంలోని వర్నిరోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌బీఎల్ బ్యాంకును మేయర్ నీతూకిరణ్ సోమవారం ప్రారంభించారు. ఆర్‌బీఎల్ అధికారులు, కార్పొరేటర్ వైష్ణవి, సీతారం పాల్గొన్నారు.

**అనాథ శవానికి అంత్యక్రియలు**

**నిజామాబాద్‌నాగారం:** ఇటీవల అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. దీంతో సోమవారం మృతదేహానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సాయిబాబు, గంగాధర్, సాయితేజ తదితరులు ఉన్నారు.

**నర్సింగ్ సూపరింటెండెంట్‌లకు సన్మానం**

**ఖలీల్‌వాడి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నర్సింగ్ సూపరిండెంట్‌లుగా గ్రేడ్-1 జి.చంద్రకళ, గ్రేడ్-2 బి. చంద్రకళలను జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ సన్మానం చేశారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**మట్టి గణపతుల ప్రాముఖ్యతపై అవగాహన**

**నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఎల్లమ్మగుట్టలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు మట్టి గణపతుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. 17న వినాయక్‌నగర్ మట్టి గణపతులను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పీవీ విగ్రహానికి ఆర్థిక సహాయం అందించిన జయంత్ రావును సన్మానించారు.

**ప్రేమ్‌లాల్‌కు సర్వేపల్లి పురస్కారం**

**నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్‌కు సోమవారం హైదరాబాద్‌లో అర్పిత సంస్థ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం ప్రదానం చేశారు. కృష్ణమనోహర్, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

**పుస్తకావిష్కరణ**

**నిజామాబాద్‌అర్బన్:** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం గిరిజన జీవనాంశాలను, సాంస్కృతిక విశేషాలను స్పృశించిన సాహితీ పుస్తకం 'తెలుగు సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ' పుస్తకాన్ని ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

**స్వర్ణామృత ప్రాశన మందు పంపిణీ**

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన మందు సోమవారం పంపిణీ చేశారు. నర్సింహారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

**యోగా మ్యాట్లు పంపిణీ**

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యోగా క్రీడాకారులకు సోమవారం వార్డు సభ్యుడు అంగల్ నవీన్‌రెడ్డి రూ.20వేలు విలువైన యోగా మ్యాట్లను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులున్నారు.

**అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేయాలి**

**సుభాష్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళిత బంధు, గృహలక్ష్మీ పథకాలు వర్తింపజేయాలని బీఎస్పీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి సీరడి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.